# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త




## అనుమానాస్పద రీతిలో 17 గొర్రెలు మృతి



శాంతిపురం, జూలై 23 ప్రభాతవార్త

మండలంలోని చెంగుబళ్ల గ్రామంలో కృష్ణప్ప అనే వ్యక్తికి చెందిన సుమారు పదిహేడు గొర్రెలు అనుమానాస్పద రీతిలో మృతి చెందాయి. గొర్రెలపై రేసు కుక్కలు దాడి చేశాయా లేదా మరే కారణమనేది తెలియరాలేదు. బుధవారం నిద్రలేవగానే గొర్రెలు మృతి చెంది ఉండడాన్ని గుర్తిం చిన కృష్ణప్ప అధికారులకు సమాచారం ఇచ్చాడు. సుమారు రూ.2లక్షలు నష్టం కలిగిందని వాపో యాడు. అటవీ అధికారులు మాట్లాడుతూ సంఘటన ప్రాంతంలో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి పరిశీలిస్తామన్నారు. విషయం తెలియగానే పిఏసిఎస్ ఛైర్మన్ గోపాల్ సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. తహశీల్దార్ శివయ్య, విఆర్వో చెంగలరాయలు, అటవీ, పశువైద్య శాఖ అధికారులు గొర్రెలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. బాధితులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

## ఇంటి దొంగలను విచారణ చేపట్టిన పోలీసులు

బోయకొండ(చౌడేపల్లి), జూలై 23 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరిగిన టిక్కెట్ల విషయంలో జరిగిన అవినీతిపై పోలీసులు విచారణ చేపట్టారు. గంగమ్మ ఆలయంలో పెద్దభోగం టిక్కెట్ల విషయంలో అవినీతి చేశారనే ఆరోపణలతో 6గురిపై వేటు వేశారు. అదే విధంగా ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో ఎస్ఐ నాగేశ్వరరావు కొండపైగల కార్యనిర్వహణా కార్యక్రమంలో విచారణ చేపట్టారు. టిక్కెట్ల విషయంలో ఎవరు ఏ విధంగా అవినీతికి పాల్పడ్డారన్న విషయాలను కొండపై పనిచేసే అధికారులు, సిబ్బందిని విచారించినట్లు ఎస్ఐ తెలిపారు. సాక్ష్యాధారలతో కేసు నమోదు చేస్తామన్నారు. ఆలయ అధికారు, సిబ్బంది విచారణలోపాల్గొన్నారు.

# 'మత్తు' ఇంజక్షన్ల కలకలం!

### -శివార్లలో విస్తరిస్తున్న విష సంస్కృతి !
### -మాత్రల్ని కరిగించి ద్రవంగా ఇంజక్షన్ రూపంలో ఎక్కించుకుంటున్న యువత



ప్రభాతవార్త-తిరుపతి:

ప్రశాంత తిరుపతి జిల్లాను మాదకద్రవ్య విక్రయాలు, సేవన రహితంగా మార్చేందుకు తిరుపతి జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ ఓ వైపు దాడులు చేస్తున్నా...,కొందరు మత్తుకు బానిసైన యువకులు, బాలలు రకరకాలుగా ఇంజక్షన్ల రూపంలో తీసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే రెండేళ్ళుగా తిరుపతి నగరం శివార్లలో ,రూరల్‌మండలంలో అక్రమరవాణా,విక్రయాలు జరిగిన గంజాయిపై జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు డేగకళ్ళతో ఉక్కుపాదం మోపుతున్నారు. అంతేగాక అధునాతన డ్రోన్‌కెమెరాలతో తిరుపతి నగరంలోనేగాక రూరల్, శివారుప్రాంతాలపై రాత్రివేళల్లో కూడా నిఘా ఉంచి ఖాళీస్థలాల్లో, పాడబడిన ఇళ్ళలో మాదకద్రవ్యాలు సేవిస్తున్నవారిని, గంజాయి, మద్యం సేవిస్తున్న వారిని కనిపెట్టి మరీ పట్టుకుంటున్న కేసులు చాలావరకు నమోదవుతున్నాయి. తిరుపతి జిల్లాలో ప్రత్యేకంగా తిరుపతి నగరం శివార్లలో డ్రోన్‌కెమెరాల నిఘాతో ఏ సమయంలో ఎటు వచ్చి ఫోటోలతో చిత్రీకరిస్తాయనే భయం నెలకొంది. అయితే ఇదే సమయంలో ఇందుకు భిన్నంగా బుధవారం మధ్యాహ్నం ఇద్దరు బాలురు ఏకంగా మాత్రలు కరిగించి ఆ ద్రవాన్ని ఇంజెక్షన్ల రూపంలో వేసుకుంటూ మత్తుకు బానిసైనట్లు పోలీసులు కనుగోన్నారు.నగరశివార్లలోని లింగేశ్వర్‌నగర్ సమీపంలోని చెట్లపొదల్లో నలుగురు యువకులు మత్తు ఇంజక్షన్ వేసుకుంటుండగా ఈగల్‌టీమ్, పోలీసు డ్రోన్ గుర్తించింది. వెంటనే అక్కడకు ఎంఆర్‌పల్లి సిఐ చిన్నగోవిందు ,పోలీసులు చేరుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.ఏకంగా మత్తునిచ్చే మాత్రలు కరిగించి ఆ ద్రవాన్ని ఇంజెక్షన్ల రూపంలో వేసుకుంటూ మత్తుకు బానిసైనట్లు పోలీసులు సమాచారం రాబట్టారు. అయితే వారికి ఆ మత్తుమాత్రలు ఎక్కడ కొనుగోలుచేశారు,ఏమందుల దుకాణంలో విక్రయించారనే సమాచారం మాత్రం వెల్లడించలేదు. పైగా యువతను, 14ఏళ్ళవయసున్న పిల్లలను దురలవాట్లలో గంజాయి, వైట్‌నర్ వంటివి అక్రమంగా విక్రయిస్తూ బానిసల్ని చేస్తున్నారనేది ఆందోళన కలిగించే విషయంగా మారింది. బుధవారం పట్టుబడిన యువకుల్ని వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోలీసులు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపామని చెబుతున్నారు. అయితే కేసు నమోదు చేయకుండా వదిలినా వారిపై నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా పిల్లలు, యువత మత్తుకు అలవాటుపడితే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మరోసారి ఇలాంటి వాటిఇ పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. తిరుపతి జిల్లాలో గంజాయి,బంగాకు వంటి మత్తుపదార్థాలు,మాదకద్రవ్యాలపై జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నిఘాతో తిరుపతిలో దాదాపు గంజాయి అక్రమరవాణా, విక్రయాలకు అడ్డుకట్టపడింది. ఈ సమయంలో ఇంజక్షన్ల రూపంలో ఎక్కించుకోవడం సంచలనంగా మారింది. ఇదో కొత్తరకం మత్తునిచ్చేదిగా పోలీసులు గుర్తించారు. మత్తు ఇంజక్షన్ వేసుకున్న బాలురు సైకోలుగా వెకిలిచేష్టలు నవ్వడం, పరుగులుతీయడం చేశారు. మత్తుకు అలవాటుపడిన బాలురు వారి మెదడు పాదరసంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతూన్నారు.

### జాతీయ మహిళా సాధికారిత కాన్ఫెరెన్స్‌ను
# విజయవంతం చేయండి
### - అయ్యన్న పాత్రుడు,రఘురామ కృష్ణ, సత్యప్రసాద్ పిలుపు



- సమావేశంలో మాట్లాడుతున్న అయ్యన్న పాత్రుడు,రఘురామకృష్ణ, సత్య ప్రసాద్

తిరుపతి కలెక్టరేట్, జూలై 23 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో సెప్టెంబరు 14,15వ తేదీల్లో రెండు రోజులు పాటు జాతీయ మహిళా సాధికారిత కాన్ఫెరెన్స్ జరుగుతుందని, ఈ కాన్ఫెరెన్స్‌ను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ఏపీ శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఏపీ శాసన సభ డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్,ఏపీ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ప్రసన్నకుమార్, సూర్యదేవర, ఏపీ శాసన సభ ఓఎస్‌డీ పెట్టన్న చౌదరి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామల రావు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగర పాలక కమిషనర్ ఎన్.మౌర్య, సంబంధిత అధికారులతో కలిసి జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం మొత్తం మీద 31 అసెంబ్లీలు ఉన్నాయని, ప్రతి అసెంబ్లీలో కూడా వివిధ రకాల కమిటీలు ఉంటాయన్నారు. పార్లమెంట్ స్పీకర్ నూతన ఒరవడి తీసుకుని రావడం జరిగిందన్నారు. ఈ కమిటీల ద్వారా అనేక సమస్యలపై చర్చలు జరుగుతుంటాయని, వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు ఈ సమావేశం అనంతరం కాన్ఫెరెన్స్‌కు హాజరైన వారికి శ్రీ కాళహస్తి దైవ దర్శనం, శ్రీసిటి, శ్రీహరికోట వంటి ప్రదేశాలలో సందర్శించడం జరుగుతుందని అన్నారు. మన రాష్ట్రంలో మహిళలకు సంబంధించిన కార్యక్రమాలు కూడా నిర్వహణ కూడా అదే రోజు ఉంటుందన్నారు.

## రాయలవారి కోట సందర్శనకు.. జాతీయ మహిళా సాధికారత కమిటీ.!
### అద్భుతమైన ఆతిధ్యానికి నిరీక్షణ
### అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నతో తుడా ఛైర్మన్



చంద్రగిరి, జూలై 23 ప్రభాతవార్త:

చారిత్రాత్మక చంద్రగిరి రాయలవారి కోటను జాతీయ మహిళా సాధికారత కమిటీ సభ్యులు సందర్శించనున్నట్లు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో కలసి బుధవారం ఆయన కోటను సందర్శించారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ ఆయనకు కోట విశిష్టతను చక్కగా వివరించారు. అనంతరం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 14, 15 తిరుపతిలో నిర్వహించతలపెట్టిన జాతీయ మహిళా సాధికారత కమిటీ సమావేశాలకు పార్లమెంట్ స్పీకర్, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రితో పాటు జాతీయ మహిళా సాధికారత కమిటీ సభ్యులు, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో వీరంతా ఒకరోజు కోటను సందర్శించనున్నట్లు తెలిపారు. ఆ రోజున కమిటీ వారికి మ్యూజికల్ లైట్స్ షో ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పసందైన వంటకాలతో విందును ఇస్తామని తుడా ఛైర్మన్ తెలిపారు. దేశం నలుమూలల నుండి వచ్చే అతిధులకు ఆంధ్ర ఆతిథ్యం అత్యద్భుతంగా అందించాలని స్పీకర్ సూచించారు. అంతకు ముందు తుడా ఛైర్మన్ స్పీకర్‌ను ఘనంగా సన్మానించగా, స్థానిక కూటమి నాయకులు వారి ఇరువురిని ఘనంగా సన్మానించారు.

# గిరిజనులకు ప్రభుత్వం అండ
### గిరిజనులతో వెట్టిచాకిరి చేస్తే కఠిన చర్యలు .. ఎస్టీ కమిషన్ ఛైర్మన్



రేణిగుంట జులై 23 ప్రభాతవార్త

రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకర్ రావు రేణిగుంట మండలంలోని వివిధ ఎస్టి కాలనీలను, ఎస్టి కాలనీలోని పాఠశాలలను విమానాశ్రయ సమీపం నందున్న సాంఘిక సంక్షేమ గిరిజన గురుకుల పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎస్సీ కాలనీలోని ప్రజలు, పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. వెదళ్ళ చెరువు ఎస్టి కాలనీ వాసులు ప్రతి సంవత్సరం వర్షాకాలం రాళ్ల కాలువ వాగు పొంగి కాలనీని ముంపుకు గురి చేస్తుందని ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పూర్వీకుల మొదలు ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్నామని, ప్రభుత్వం గుర్తించి కాలనీ ఏర్పాటు చేసిందని ఇక్కడి నుంచి వేరే స్థలాలకు వెళ్లలేమని కాలనీవాసులు తెలిపారు. స్పందించిన ఛైర్మన్ కాలనీ ముంపుకు గురికాకుండా రిటైనింగ్ వాల్ (అడ్డుగోడ) నిర్మాణానికి ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విమానాశ్ర సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల గిరిజన బాలుర పాఠశాలకు ఆకస్మికంగా వెళ్లారు. ఆయనకు ప్రిన్సిపల్ హరి ఆధ్వర్యంలో స్కౌట్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు, అధ్యాపక బృందం ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాలలోని తరగతి, హాస్టల్, డైనింగ్ గదులు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై పాఠశాల స్థితిగతులను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన బాగుందా?భోజన మెనూ, ఉదయం బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న లంచ్, రాత్రి డిన్నర్ లలో మంచి పౌష్టికాహారం అందుతుందా? యూనిఫామ్ దుస్తులు, విద్యా సామాగ్రి కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, సరిగ్గా అందజేస్తున్నారా? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ముఖ్యంగా హాస్టల్ గదిలో మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. కొన్ని గదుల్లో కిటికీలు, తలుపులు పాడైపోయి ఉండడం,పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ గోడ అక్కడక్కడ పోవడానికి గుర్తించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై బాగా చదువుకొని మంచిమార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు.. చివరిగా విలేకరులతో మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గిరిజన గురుకుల బాలుర పాఠశాల నందు మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజనులకు ప్రభుత్వం అండదండలు ఉంటాయన్నారు. గిరిజనులను వెట్టి చాకిరికి పెట్టుకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆయనతోపాటు రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో ప్రభురావు, ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథ్, రూరల్ సీఐ మంజునాథ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తదితరులు ఉన్నారు.

## కన్నుల పండువగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి,జూలై 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలోనూ, విజ్ఞాన గిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా బుధవారం వైభవంగా పార్వేట ఉత్సవాన్ని నిర్వహిం చారు. ఆలయంలోని అలంకార మండపంలో గురుకుల్ రాజేష్ గురుకుల్ స్వామి అమ్మవార్లను చక్కగా ముస్తాబు చేశారు. ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి సారధ్యంలో అర్చకులు హారతులివ్వగా స్వామి అమ్మవార్లను పార్వేటకు తరలించారు.ఈ ఏడాది ఉత్సవాల్లో ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు అవకాశం లేకుండా నిర్వ హించటంలో ఇఓ, సూచనలు, అధికారులు సిబ్బంది సమన్వయం, చొరవ సత్ఫలితాల నిచ్చింది. పార్వేట ఉత్సవాన్ని తేరువీధి నుంచిప్రారంభించారు. నెహ్రూవీధి, ముత్యాలమ్మగుడి వీధి,బహదూరుపేట, నల్లగంగమ్మ గుడి బహదూరుపేట తెట్టు వద్ద వరకు వెళ్ళింది. ఉత్సవంతో పాటు చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్,,ఆలయ ప్రధాన అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, ప్రధానార్చకులుకరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్ పూజలు నిర్వహించగా ఉత్సవంతో పాటు ఆలయ ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, దఫేదార్ సుధాకర్ వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది. ఏడాదిలో ఒక్క సారి జరిగే ఉ త్సవం ఊరంతా సాగటంతో ఇంటింటి వద్ద భక్తులు హారతులిచ్చారు.

## అన్నంలో వానపాము ప్రత్యక్షం
### ఎస్వీయూ డీమెస్లో ఘటన



తిరుపతి విద్య, జూలై 23 ప్రభాత వార్త

ఎస్వీయూ డీమెస్లో బుధవారం రాత్రి విద్యార్థులకు వడ్డించిన భోజనంలో వానపాము ప్రత్యక్షమైంది.దీంతో విద్యార్థులకు షాక్ కు గురయ్యారు.సుమారు 200మందికిపైగా పీజీ విద్యార్థులు ప్రతి రోజు డీ మెస్లో ఆహారాన్ని స్వీకరిస్తారు.వీరంతా బుధవారం రాత్రి తమ సొంత డబ్బులతో హోటళ్లలో భోజనాలను చేసినట్లు తెలుస్తోంది. అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలాంటి సంఘటనలు పునరావృతంఅవుతూనే ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు.అధికారులు సమాచారం అందించినా విచారణ జరుపుతామంటూ దాటవేత దోరణితో వ్యవహరిచడం దారుణమని విద్యార్థులు ఆరోపిస్తు న్నారు. వర్సిటీ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి సంఘ టనలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.వందల మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ నాసిరకం భోజనాలను అందించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం
### న రెండు వాహనాలు, నలుగురు ఎర్రదొంగలు అరెస్టు

సత్యవేడు, జూలై 23 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం బస్టాండ్ వద్ద బుధవారం వేకువ జామున అక్రమంగా తరలిపోతున్న 11 ఎర్రచందనం దుంగలను వరదయ్యపాళెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఎస్ఐ మల్లికార్జున్ కథనం మేరకు... వరదయ్యపాళెం బస్టాండ్ వద్ద ఎస్ఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో పోలీసు బృందం బుధవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో ముందుగా స్కార్పియో కారు వాటి వెనుక అశోక్ లైలాండ్ మినీ వ్యాన్‌వచ్చింది. ఈ క్రమంలో పోలీసులు రెండు వాహనాలను ఆపి తనిఖీ చేయగా మినీ వ్యాన్‌లో ఎర్రదుంగలు బయటపడ్డాయి. దీంతో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వ్యాన్‌తో సహా ఎర్ర దుంగలను పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

# అత్తను హతమార్చిన అల్లుడు
### ఆలస్యం వెలుగులోకి..



నాయుడుపేట జూలై 23 ప్రభాతవార్త:

పథకం ప్రకారం అల్లుడు అత్తను హతమార్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట మండలం పండ్లూరు గ్రామానికి చెందిన బోడెద్దుల వెంకయ్య అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన సగుటూరు చెంగమ్మ కుమార్తెను వివాహం చేసుకొన్నాడు.అప్పటి నుండి గతకొంత కాలం వరకు సజావుగా సాగినవారి కాపురం మధ్యలో వెంకయ్య మద్యానికి బానిస కావడంతో భార్యభర్తల మధ్య తరచూ ఘర్షణ పడుతుండేవారు. విషయం తెలుసుకొన్న అత్త సగుటూరు చెంగమ్మ కుమార్తెను పుట్టింటికి అయ్యప్పరెడ్డిపాళెం తీసుకువెళ్ళింది. దీంతో అత్తమీద ద్వేషం పెంచుకొన్న వెంకయ్య మంగళవారం రాత్రి నాయుడుపేట నుండి ఇంటికి వెళుతున్న చెంగమ్మను మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకొని ఇంటికి తీసుకువెళ్తానని చెప్పి మార్గమధ్యలో తుమ్మూరు సమీపంలోని స్వర్ణముఖినది వద్దకు తీసుకువెళ్ళి అక్కడ సగుటూరు చెంగమ్మను బలవంతంగా హత్యచేసి స్వర్ణముఖినది పూడ్చిపెట్టి అక్కడ నుండి పరారయ్యాడు.చెంగమ్మ రాత్రిఇంటికి రాకపోవడంతో కుమార్తె సుకన్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకొన్న పోలీసులు వెంకయ్యపై అనుమానంలో అదుపులోనికి తీసుకొని విచారించగా తన భార్యను కాపురానికి పంపలేదన్న కోపంతో అత్త చెంగమ్మను హత్యచేసి స్వర్ణముఖినదిలో పూడ్చిపెట్టినట్లు తెలిపారు.అనంతరం నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు స్వర్ణముఖినది వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు.చెంగమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.నిందితుడు వెంకయ్యను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు నాయుడుపేట సిఐ బాబి తెలిపారు.

# రాబోవు రోజుల్లో రౌతుసూరమాల పారిశ్రామిక హబ్
### నిరుద్యోగులకు ఉపాధి పండగ
### ఎక్సోరాతో ప్రజల ప్రాణాలకు ముప్పు:సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు,జూలై 23 ప్రభాతవార్త

రాబోవు రోజుల్లో తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల పరిసరాలు పరిశ్రామిక హబ్ కాగలదని నిరుద్యోగులనే వారే ఉండరని గ్రామీణులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగమనాయుడుపల్లి, రౌతుసూరమాల గ్రామాల్లో పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఎంఎల్‌ఏ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ ప్రాంతంలో ఎక్సోరా పరిశ్రమతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందనే నివేదికలతో ఎంఎల్‌ఏ స్పందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ప్రాంతాల్లో పరిశ్రమల హాబ్‌గా మార్చామన్నారు. చెన్నై నాయుడుపేట జాతీయ రహదారులనుకలుపుతూ చక్కటి రోడ్లకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అనుమతించారన్నారు. మండలంలోని రౌతుసూరమాల, లింగమనాయుడుపల్లిలో భారీ ఎత్తున పరిశ్రమలు రానున్నట్లు తెలిపారు.గతంలో తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కజారియా పరిశ్రమను తీసుకొచ్చారని ఇక్కడ ప్రస్తుత ముఖ్యమంత్రి నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రారంభించారన్నారు. రాబోవు రోజుల్లో కూడా చెన్నై: విశాఖ కారిడార్ ఈ గ్రామాల మీదుగా పోతుందని ఈ ప్రాంతాల రూపు రేఖలు పట్టణాల కన్నా మిన్నగా మారుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. భూముల విలువ పెరుగుతుందని వివరించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి నిధులు మంజూరులో ప్రత్యేకత కల్పిస్తున్నారన్నారు. శ్రీకాళహస్తిలో నిరుపేద విద్యార్థుల కోసం స్కిట్ కళాశాలను తెరవటానికి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ సహకారం ప్రజలు మరువరాదన్నారు.అయితే సాంకేతిక సమస్యలున్నాయన్నారు.శ్రీకాళహస్తి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా పరిపాలన సాగిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో తొట్టంబేడు వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు, రామానాయుడు,కమల్‌కుమార్,రాజేంద్ర,సర్పంచ్ రాజేంద్రనాథ్‌రెడ్డి,వెంకటాచలం, మునిరత్నం, రమేష్,లెక్కల మురళీనాయుడు,కన్నల ప్రతాప్‌రెడ్డి,బాలాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ఎక్సోరాతో ప్రజల ప్రాణాలకు ముప్పు:

తొట్టంబేడు మండలంలో బుధవారం పర్యటించిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డికి ఇక్కడ మూతపడ్డ ఎక్సోరా కంపెనీ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందనే ఐఐటి నివేదికలతో ఎంఎల్‌ఏ స్పందించారు. సాధారణంగా ఈ కంపెనీలతో మనిషిలో ఉండాల్సిన లెడ్ 10శాతం ఉండాల్సి ఉండగా 76 శాతం ఉన్నట్లు వైద్య నివేదికలు గమనించిన శాసనసభ్యుడు తీవ్రంగా స్పందించారు.ఇప్పటికే ఈ గ్రామాల్లో సుమారు పది మంది డయాల్సిస్‌కు లోనయ్యారన్నారు.గతంలో కూడా పశువులు మృత్యుబారిన పడ్డారని గ్రామస్తులు తెలిపారు. దాంతో ఈ పరిశ్రమకు సంబంధించి సమగ్ర నివేదికలు అందించాలని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి అధికారులను కోరారు.

# ఆగస్టు 15లోపు కళాకారులు దరఖాస్తులు

కాణిపాకం, జులై 23 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనదలచిన కళాకారులు ఆగస్టు 15వ తేదీలోపు దేవస్థానం కార్యాలయంకు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఇఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆగస్టు 27వ తేదీ నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు జరుగనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల కాల క్షేపం నిమిత్తం దేవస్థానం ఆస్థాన మండపంలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే కళాకారులు ఆగస్టు 15వ తేదీలోపు దేవస్థానం కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.15వ తేదీ తరువాత దరఖాస్తులను స్వీకరిం చడంజరుగదనిఇఓస్పష్టం చేశారు. కళాకారులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని ఇఓ కోరారు.

# సుచి ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కల పంపిణీ



తవణంపల్లి, జులై 23 ప్రభాతవార్త:
మండలంలోని ఉత్తరబ్రహ్మణపల్లి గ్రామంలో సుచి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. సుచి సంస్థ అధినేత పాల్ విజయకుమార్, గ్లోరి విజయకుమార్‌ల ఆధ్వర్యంలో గ్రామంలోని 40 కుటుంబాల వారికి ఒక కుటుంబానికి రెండు కొబ్బరి మొక్కలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ముఖ్యంగా పెరటి తోటల్లో మొక్కలను విరివిగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుచి సిబ్బంది శ్యామ్ ఆనందకుమార్, ధనలక్ష్మి, జాకబ్, జాన్సన్, వరదరాజులు, చిన్నయ్య, మాజీ సర్పంచ్ దామోదరం, గ్రామస్తులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత -



బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్
- కెఇసిలో ఘనంగా వనమహోత్సవం !!

కుప్పం, జులై 23 ప్రభాతవార్త
ప్రపంచంలో గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా మారిందని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో అధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమంను చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం గురించి ప్రతి ఒక్కరూఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లను నరికేస్తుండడంతో పర్యావరణం తగ్గిపోతోందన్నారు. దీంతో కాలుష్యం పెరుగుతోందన్నారు. చెట్ల సంరక్షణపై ప్రజల్లో అవగాహన మరింత పెంచాలన్నారు. వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమిస్తూ, పరిరక్షిస్తూ ప్రకృతితో కలసి జీవనం సాగిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందన్నారు. పచ్చదనం పెంపుదలకు విద్యార్థులు ముందుకు రావాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, డిఆర్వో సమీర్ బాషా, ఎఫ్‌బిఒలు సుధాకర్, మధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో హాకింగ్స్ విద్యార్థికి స్టేట్ ర్యాంక్

కుప్పంరూరల్, జులై 23 ప్రభాతవార్త



సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో కుప్పం హాకింగ్స్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సాయిచరణ్ రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ ఎస్‌డి హఫీజ్ తెలిపారు. బుధవారం పాఠశాలలో సాయి చరణ్, అతని తల్లిదండ్రులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా ఛైర్మన్ హఫీజ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలన్నారు. ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేయాలన్నారు. నిరంతరం లక్ష్యసాధనలో నిమగ్నం కావాలన్నారు. సాయిచరణ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాక్షించారు. పాఠశాలలో బోధించే సిబిఎస్ఇ సిలబస్‌తో తమ కుమారుడు ఎలాంటి శిక్షణ పొందకనే రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించాడని, పాఠశాలలో ఉన్న క్రమశిక్షణ, ప్రోత్సాహం, యాజమాన్యం సహకారంతో తమకుమారుడు ఈ ఘనత సాధించినట్లు సాయిచరణ్ తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షబ్బీర్, వైస్ ప్రిన్సిపాల్ అరుణాసింగ్ చౌహాన్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైకాపా సీనియర్‌నేత మృతి ..నేతల నివాళులు.



పెద్దపంజాణి జూలై23 ప్రభాతవార్త:
మండలంలోని రాజుపల్లి ఎంపిటిసి మునేశ్వరి భర్త వైకాపా సీనియర్ నాయకుడు అయిన క్రిష్ణప్ప మృతిచెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారు. విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు,ఎంపిపి రెడ్డెప్ప,మాజీ ఎంపిపి భాస్కర్ రెడ్డి,వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి,వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.క్రిష్ణప్ప మృతి వారి కుటుంబానికి తీరనిలోటని వారు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ శ్రీరాములు,నాయకులు భానుప్రతాప్ రెడ్డి,పృధ్వీనాథ్,మంజునాథ్ రెడ్డి,నాగరాజు యాదవ్,రాజేష్ రెడ్డి,ఎంపిడిఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# బోరుమోటారు నుంచి కేబుల్‌తీగలు చోరీ

పెద్దపంజాణి జూలై23 ప్రభాతవార్త:



మండలంలోని బసవరాజుకండ్రిగ గ్రామంలో ప్రభుత్వం తాగునీటి సౌకర్యంకోసం ఏర్పాటుచేసిన బోరుకు సంబంధించిన బోరు మోటారు స్టాటర్‌కు చెందిన కేబుల్‌తీగలను గుర్తుతెలియని దుండు గలు చోరీచేసి తీసుకెళ్ళినట్లు గ్రామస్థులు తెలిపారు.దాదాపు 25 మీటర్ల కేబుల్ తీగలను దుండగులు పట్లుకెళ్ళినట్లు తెలిపారు. అధికారులు స్పందించి కేబుల్‌వైరును ఏర్పాటుచేసి గ్రామంలో మంచినీటిసమస్య తలెత్తకుండా చూడాలని గ్రామస్థులు కోరారు.

# ఎంపిడిఓచే షాదీమహల్ నిర్మాణంకై స్థల పరిశీలన

శాంతిపురం, జూలై 23 ప్రభాతవార్త



మండలంలోని కెపి మిట్ట గ్రామంలో షాదీమహల్ నిర్మాణంకు గాను ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. గ్రామంలో షాదీమహల్ నిర్మాణం కోసం గ్రామస్తులు సిఎం చంద్రబాబునాయుడును కోరి ఉన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంపిడిఓ గ్రామంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపిడిఓ తెలిపారు. కాగా గ్రామంలో ఎగువ ప్రాంతంలో ఉన్న వారికి తాగునీరు సక్రమంగా అందడం లేదని నూతన బోరు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి, జయపాల్, నూరుల్లా, చాంద్‌బాషా, యారబ్, రసూల్, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.




# విద్యుత్తు భారం వద్దు

పుంగనూరు రూరల్, జూలై 23, ప్రభాతవార్త
ప్రజలపై విధిస్తున్న విద్యుత్ భారం దారుణమని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ప్రజలపై పెరుగుతున్న ఛార్జీల భారం తట్టుకోలేని స్థితికి చేరిందని విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రి నారా లోకేశ్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన వైనాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో మేనేజ్మెంట్ వైఫల్యం వల్లే ఈ భారం పెరిగిందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకొని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

# ఒక్క నిర్ణయం... ఉజ్వల భవిష్యత్తు

పుంగనూరు, జూలై 23, ప్రభాతవార్త



డిగ్రీ పూర్తి చేసే విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం మరింత చదువులు చదివేందుకు చక్కని నిర్ణయం తీసుకుంటే చాలని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు రాజేంద్రన్ విద్యార్థినీ విద్యార్థులకు చదువే ఆభరణమని, క్షుణ్ణంగా అభ్యసించాలని సూచించారు. విద్యార్థులు తమ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎలా ముందుకు నడవాలో, క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థానాలను ఉన్నత శిఖరాలను ఎలా అధిరోహించాలో ఉదాహరణలతో తెలియజేస్తూ, ఎందరో గొప్ప వారి చరిత్రలను పరిచయం చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో విషయాలను తెలుసుకున్నారు. కోఆర్డినేటర్ అనిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి శ్రీనివాస్ రాజేంద్రన్‌ను సత్కరించారు.

# సత్య గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.80లక్షలు

పలమనేరు,జూలై 23,ప్రభాతవార్త:
పలమనేరు శ్రీ సత్య గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.80లక్షలు వచ్చినట్లు దేవాస్థాన నిర్వహణ అధికారి కమలాకర్ తెలిపారు.బుధవారం ఆలయ ఆవరణలో గత 4 నెలల హుండీ ఆదాయాన్ని అధికారులు లెక్కింపు నిర్వహించారు.ఈ మేరకు ఆలయ ఆదాయం రూ.1,80,770లు వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ దేవాలయ శాఖ తనిఖీదారు శశికుమార్,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యానాదుల ఇంటి కలను నెరవేర్చుతా : పతిరాజు

చౌడేపల్లి, జూలై 23 ప్రభాతవార్త



యానాదుల ఇంటి కలను నెరవేర్చేదిశగా కృషి చేస్తానని తేదేపా సీనియర్ నాయకుడు లక్ష్మణరాజు (పతిరాజు)అన్నారు. మండలంలోని శెట్టిపేట పంచాయతీ ఎర్రగంగనపల్లి సమీపంలోని యానాదిండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో యానాదులకు ఇళ్ళు నిర్మించి ఇస్తామని నాశిరక నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను జేబుల్లోకి నింపుకొని ఇళ్ళ నిర్మాణాలను విస్మరించారన్నారు. వాటన్నింటికీ తాను పూర్తి చేసి వారికందిస్తామన్నారు. ఇళ్ళ నిర్మాణాలు చేపట్టడంతో యానాది కుటుంబాలు పతిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్‌విండో ఛేర్మన్ హరిరాయల్, తేదేపా నాయకులు కార్తీక్‌రాయల్, మంజునాథ్, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలి : గంగయ్య

చౌడేపల్లి, జూలై 23 ప్రభాతవార్త



అంటు వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా వుండాలని జిల్లా మలేరియా అధికారి గంగయ్య అన్నారు. పట్టణంలోని మేదరదొడ్డిలో ఇంటింటికి వెళ్ళి వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ముఖ్యంగా వివిధ రకాల జ్వరాల పట్ల జాగ్రత్తగా వుండాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈగలు, దోమల నుంచి ఆహార పదార్థాలను రక్షించుకోవాలన్నారు. అనంతరం అంటువ్యాధులపై ర్యాలీ నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్‌లో మెడికల్ టూరిజంకు విస్తృత అవకాశాలు

- సౌదీ అరేబియా ఎలక్ట్రానిక్స్ యూనివర్సిటీ
అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లింగాల కళ్యాణ్ విశ్వనాథరెడ్డి

చిత్తూరు, జూలై 23 ప్రభాతవార్త:



భారతదేశంలో మెడికల్ టూరిజంకు విస్తృతంగా అవకాశాలు వున్నాయని సౌదీ అరేబియాలోని సౌదీ ఎలక్ట్రానిక్ యూనివర్సిటీ ప్రజారోగ్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లింగాల కళ్యాణ్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు అపోలో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ సి. ప్రతాప్‌రెడ్డి నాలెడ్జి సెంటర్‌లో మెడికల్ టూరిజం అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సౌదీ అరేబియాలోని సౌదీ ఎలక్ట్రానిక్ యూనివర్సిటీ ప్రజారోగ్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లింగాల కళ్యాణ్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మెడికల్ టూరిజం రంగం వైద్య సేవల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇది భారతదేశానికి నూతన ఆర్థిక అవకాశాలు తీసుకువచ్చే రంగమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ ఎంబిఏ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ రామయ్య ఇటుమల్ల సమన్వయకర్తగా వ్యవహరించారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

పూతలపట్టు, జూలై 23, ప్రభాతవార



పూతలపట్టు కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం ద్వారా పథకాలు అందాయా లేదా అని ఇంటింటికి ప్రచారం వెళ్లి ప్రజలను స్వయంగా హక్కును చేర్చుకుని వారి బాధలను వారి ఆవేదనను వింటూ ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముత్తు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# ప్రభుత్వ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలి

- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, జూలై 23 ప్రభాతవార్త
ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కుటుంబ సాధికార సభ్యులు (కెఎస్ఎస్) ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొటాలూరు, అడవిబూదుగూరు గ్రామాల్లో జరిగిన సాధికార సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో కుటుంబ సాధికార సభ్యులది కీలకపాత్ర అన్నారు. తమ పరిధిలో ఉన్న అరవై కుటుంబాల యోగక్షేమాల బాధ్యతలు కెఎస్ఎస్ సభ్యులపై ఉందన్నారు. ప్రజల సమస్యలు, వారికి ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం కావాలి అనే అంశంగా తగు నివేదికలు రూపొందించుకోవాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు పార్టీలో కష్టపడే వారికి తప్పక గుర్తింపు ఇస్తారన్నారు. ప్రస్తుతం చేపడుతున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, సర్పంచ్ రాజేంద్రన్, మాజీ సర్పంచ్ సంజీవరాజులునాయుడు, నేతలు చిట్టిబాబు, కృష్ణమూర్తి, విభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# టువీలర్‌లో తరలిస్తున్న నాటుసారా పట్టివేత

- ఒకరి అరెస్ట్.. ముగ్గురిపై కేసు నమోదు !!

కుప్పం, జూలై 23 ప్రభాతవార్త



కుప్పం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కుప్పం మండలం మొట్లచేను గ్రామం వద్ద బుధవారం ఎక్సైజ్ సిఐ నాగరాజ అధ్వర్యంలో సారా విక్రయాలపై సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా టువీలర్ లో పది లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. తాము వాహనాలు తనిఖీ చేస్తుండగా తమను చూసి టివిఎస్ వాహనంలో పారిపోయే యత్నం చేయగా అతన్ని వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. ఈసంఘటనలో మొట్లచేనుకు చెందిన పాపోడు (39) అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా 15 రోజుల రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశించారన్నారు. ఈ విషయంగా గ్రామంలో విచారించగా మొట్లచేనుకు చెందిన అన్నాదొరై, చిన్న ఒబ్బకు చెందిన రామ్‌కుమార్‌ల వద్ద సారా కొనుగోలు చేసేవారని తెలియడంతో వారిద్దరిపై సైతం కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు మోహన్‌బాబు, అన్వేష్, హెడ్‌కానిస్టేబుల్ చలపతి, ఆచారి, సిబ్బంది వెంకటేష్, పన్నీరునాయక్, రేఖ, పద్మ పాల్గొన్నారు.

# నేడు ఒప్పంద అధ్యాపకుల కొనసాగింపుకు కౌన్సిలింగ్

చిత్తూరురూరల్, జూలై 23 ప్రభాతవార్త:
చిత్తూరు పట్టణం, పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు ఈనెల 24వతేది గురువారం ఉదయం 10గంటలకు చిత్తూరు జిల్లాలో గత సంవత్సరం (2024-25) పనిచేసిన ఒప్పంద అధ్యాపకుల పనికాలాన్ని (2025-26) విద్యాసంవత్సరం కొనసాగింపుకు కౌన్సిలింగు నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎమ్మెల్యే గురజాల ఇంటికి కర్నాటక భాజపా ఎమ్మెల్యేలు

చిత్తూరురూరల్, జూలై 23 ప్రభాతవార్త:



చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ గృహానికి బుధవారం కర్నాటక రాష్ట్ర శాసనసభప్రతి పక్ష నేత, భాజపా ఎమ్మెల్యే ఆర్ అశోక్, దొడ్డబల్లాపూర ఎమ్మెల్యే ధీరజ్‌మునిరాజ్‌లు విచ్చేసారు. ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించి అల్పాహారం ఏర్పాటుచేసి దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. అనంతరం ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులను పరిచయం చేసారు.

# రాజమ్మా నీకు ఇల్లు కట్టిస్తా..

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరురూరల్, జూలై 23 ప్రభాతవార్త:



రాజమ్మా నీకు ఇల్లు కట్టిస్తా.. రోడ్డు, కాలువలు ఏర్పాటు చేసిస్తానని రాంనగర్ కాలనీకి చెందిన రాజమ్మకు చిత్తూరు శాసనభ్యులు గురజాల జగన్మోహన్ హామి ఇచ్చారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా 31, 32, 33, 34 వార్డులలో ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. రాంనగర్ కాలనీకి చెందిన రాజమ్మ తనకు గంగాకాలనీలో స్థలం వుందని, ఇల్లు కట్టుకోవాలని కోరగా ఎమ్మెల్యే కట్టిస్తానని హామి ఇస్తూ ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. అలాగే ఇద్దరు లబ్ధిదారులకు సొంతనిధులతో టీస్టాల్ స్టాండ్‌ను అందిస్తూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామిలను 90శాతం మేర అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారిహేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, కాజూరు బాలాజీ, రావూరి ఈశ్వర రావు,క్లస్టర్,డివిజన్ఇన్‌ఛార్జీలు,కన్వీనర్లు,కోకన్వీనర్లు,కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నరసింహుని కుంబాభిషేకం ప్రారంభం

పుంగనూరు రూరల్, జూలై 23, ప్రభాతవార్త



మండలంలోని గూడురుపల్లి గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో బుధవారం నుంచి కుంబాభిషేక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, సుదర్శన లక్ష్మినరసింహ హోమం, మహాపూర్ణాహుతి వంటి వేదకర్మలు వైదిక పండితుల నేతృత్వంలో నిర్వహించారు. అనంతరం స్వామివారికి స్నాపన తిరుమంజనం చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మహోత్సవాలు జూలై 25వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# తెదేపా కార్యకర్త మృతి.. ఆర్థికసాయం

రామకుప్పం, జూలై 23 ప్రభాతవార్త



మండలంలోని గద్దూరుకు చెందిన తెదేపా కార్యకర్త డ్రైవర్ భాస్కర్ మృతి చెందాడు. దీంతో బుధవారం మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ మహ్మద్ రఫీ, నేతలు రవిరెడ్డి, మునిరెడ్డి తదితరులు మృతదేహానికి నివాళులు అర్పించి అంత్యక్రియలకుఇరవైవేలఆర్థికసాయంఅందించారు. నేతలు భాస్కర్, పెరుమాళ్, సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవం

శ్రీకాళహస్తి,జూలై 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని రైల్వే స్టేషన్‌లో ఆర్‌పిఎఫ్(రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు) సారధ్యంలో బుధవారం 'మానవ అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవంను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించుటకు మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 1 నుంచి 30వరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజారెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానవ అక్రమ రవాణా అనేది పెద్ద నేరమన్నారు. అయితే మన సమాజంలో ఇదో వ్యాపారంగా మారిందన్నారు. దీని వల్ల ఎంతో భవిష్యత్తు ఉన్న యువతీ యువకులు తమ జీవితాలను కొల్పోతున్నారని వివరించారు. మానవ అక్రమ రవాణాన్ని రక రకాలుగా చేసుకున్నారని వివరించారు. ఇలా చేస్తే చట్టాల్లో కఠినంగా శిక్షలున్నాయని గుర్తించాలని సూచించారు. .ఈ కార్యక్రమాల్లో ఆర్‌పిఎఫ్ ఇన్స్పెక్టర్ మహబూబ్ సుబహానీ,స్టేషన్ మాస్టర్ రమేష్‌కుమార్ పండిట్, ఎఎస్ఐ మునికృష్ణ,కానిస్టేబుల్స్ నారాయణ, ప్రగతి సంస్థ జిల్లా కోఆర్టినేటర్ రాజారెడ్డి, చందమామల కోటయ్య, మధుకుమార్,లతలు పాల్గొన్నారు.

# కేవీ శ్రీరామాపురంలో ఇసుక అక్రమ రవాణా



**విజయపురం, జూలై 23 ప్రభాతవార్త:** మండలంలో కేవీ శ్రీరామాపురంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలో కేవీ పురం కుశస్థలీనది నుంచి ప్రతి రోజు ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అవసరం ఉన్న వారికి ఇసుక దొరకదు కానీ తమిళవాసులకు మాత్రం ఇసుక యథేచ్ఛగా తరలిపోతుందని ఆరోపణలు చేస్తున్నారు. కేవీ శ్రీరామాపురం కుశస్థలీనది నుంచి ఇసుకను తమిళనాడు సరిహద్దు మల్లారెడ్డి కండ్రిగ, శ్రీహరిపురం, నారపరాజు కండ్రిగలో రాత్రి సమయాల్లో డంప్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ట్రక్కు ఇసుక రూ.8 వేలు నుంచి రూ.10 వేలు వరకు అమ్ముతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ ఇసుక నిల్వపై ఆరోపణలు రావడంతో బుధవారం తహసీల్దార్ కిరణ్, ఎస్ఐ మహేష్‌బాబు, మల్లారెడ్డి కండ్రిగ, శ్రీహరిపురంలో నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

# విధులకు హాజరు కాకుంటే తొలగిస్తాం

తిరుపతి విద్య, జూలై 23 ప్రభాతవార్త
తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం పాఠశాలలో ఎస్టీగా విధుల నిర్వహిస్తున్న పి దేవరాజులు 2022 జూన్ 27వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ నుంచి పలు మార్లు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎంఈఓ లేఖలు పంపినప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.సదరు ఉపాధ్యాయుడు మరో మూడు రోజులలోపు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరై సంజాయిషీ ఇవ్వాలని లేనిపక్షంలో విధుల నుంచి శాశ్వతంగా తొలిగిస్తామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

# పోలీసులకు దశ దిశ నిర్దేశిస్తున్న డిఎస్పి .....



**రేణిగుంట జూలై 23 ప్రభాతవార్త** జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు అర్బన్ పోలీసులకు ట్రాఫిక్ నియంత్రణపై బుధవారం దశ దిశ నిర్దేశించారు. అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి రేణిగుంట పట్టణంలోనీ పలు ప్రధాన కూడళ్ల వద్ద పర్యటించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించడానికి చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై తప్పనిసరిగా కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరపరచాలని ఆదేశించారు. రికార్డులు సరిగ్గా లేని వాహనదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆటోల్లో పరిధికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేయాలన్నారు. వాహనాలపై సరైన గుర్తింపు కార్డు లేకుండా స్టిక్కర్లు వేసుకుంటే వెంటనే వాటిని తొలగించాలన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడకూడదన్నారు. రోడ్లపై ద్విచక్ర వాహనాలు పెట్టుకుని బాతాఖానీ చేసేవారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా బండ్లు పెట్టుకొని తినుబండారాలు అమ్ముతూ ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే వారిని ఉపేక్షింప వద్దన్నారు.

# ఎన్ఎస్‌యును సందర్శించిన కేంద్ర అధికార భాష డీడీ

తిరుపతి విద్య, జూలై 23 ప్రభాతవార్త
జాతీయ సంస్కృత వర్సిటీని కేంద్ర ప్రభుత్వ హోమ్ మంత్రిత్వశాఖ బెంగుళూరు ప్రాంతీయ కార్యాలయ అధికార భాషా విభాగం డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా వర్సిటీలోని రాజభాష విభాగాన్ని పరిశీలించిన అనంతరం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తితో పాటు అధికారులతో బృందం సమావేశమైంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 351 ప్రకారం,పరిపాలనా పని సమర్ధవంతంగా జరగాలని,కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు హిందీ,ద్విభాషలలో ఉండాలని,కంఠస్థ2.0 ఆధారంగా అనువాద సాఫ్ట్వేర్ వినియోగించాలని సూచించారు.అనంతరం వర్సిటీ ఆర్థిక,స్థాపన విభాగంలోని పరిపాలనా పత్రాలను బృందం తనిఖీ చేసింది. అనంతరం పర్యటనకు విచ్చేసి బృందాన్ని వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, డీన్లు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## లిక్కర్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమంగా అరెస్టు - నూకతోటి రాజేష్

సత్యవేడు, జూలై 23 ప్రభాతవార్త:



లిక్కర్ స్కామ్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా ఇరికించినట్టు సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ ఆరోపించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నూకతోటి రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి అనైతిక చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. పైగా లిక్కర్ స్కామ్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం ప్రభుత్వం కక్ష సాధింపు చర్య అన్నారు. తదనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ వైసీపీ శ్రేణులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిరేంద్రవర్మ, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, బెల్ట్ రమేష్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, భానుప్రకాష్ రెడ్డి, పయణి, శ్రీధర్‌రెడ్డి, టెంకాయ కిష్టయ్య, జోసఫ్, పునీత్ కుమార్, పూల పయణి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విధానంపై అవగాహన

తిరుపతి విద్య జూలై 23 ప్రభాత వార్త:



స్థానిక జీవకోనలోని నారాయణ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ, క్యాబినెట్ ఏర్పాటు, నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు,ఆర్ ఐ వసంత్ విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని నాయకత్వ లక్షణాలను అలవర్చు కోవాలన్నారు. ప్రజాస్వామ్యం పట్ల ప్రస్తుత యువతకు నమ్మకం తగ్గుతున్న తరుణంలో విద్యార్థి దశలోనె భారత దేశ వజ్రాయుధమైన ఎన్నికల ప్రక్రియను అలవర్చాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందన్నారు.పాఠశాల ఆవరణలో ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల విధానంపై పూర్తిస్థాయి అవగాహన కలిగే విధంగా నామినేషన్ ప్రక్రియ,నామినేషన్ విత్ డ్రా, స్క్రూటినీ,ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ప్రకటన అనంతరం జరిగే ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు విజేతల ప్రకటన తదితర అన్ని విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా పారదర్శంగా ఎన్నికల నిర్వహించారు. ఇలాంటి ఎన్నికల వల్ల విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు నాయకత్వ లక్షణాలు పోటీ తత్వం పెరుగుతాయని ఉత్తమ పౌరులుగా రూపుదిద్దుకోవడానికి ఉపకరిస్తుందని తెలిపారు.ఎన్నికల్లో గెలుపొందిన హెడ్ బాయ్,హెడ్ గర్ల్స్ ని ప్రకటించి వాళ్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ ప్రిన్సిపల్ సుధాకర్ నాయుడు, సుదర్శన్,పెద్ద సంఖ్యలో విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీరమల్లు విజయానికి పూజలు:మోటార్ సైకిల్ ర్యాలీ

జనసైనికుల ఉత్సాహాలు

శ్రీకాళహస్తి,జూలై 23 ప్రభాతవార్త



హరిహర వీరమల్లు విజయవంతం కావాలని శ్రీకాళహస్తిలోని జనసైనికులు పట్టణానికి సమీపంలోని వీర హనుమాన్ ఆలయంలో ప్రత్యేకపూజలు జరిపించారు. బుధవారం పట్టణంలో భారీ ర్యాలి నిర్వహించారు. పట్టణ నడిబొడ్డులోని దేవస్థానం సమాచార కేంద్రం వద్ద పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు.డెప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం గురువారం విడుదల కానుంది. ఈనేపధ్యంలో ఈ చిత్రం విజయవంతం కావాలని జనసైనికులు పూజలు చేయటం ర్యాలిలు నిర్వహించటం జరిగింది. ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి కొట్టే సాయి సారధ్యంలో సంబరాల కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలిఆర్‌టిసి బస్టాండు నుంచి నాలుగుమాడావీధుల్లో సాగింది. కార్యక్రమాల్లో కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, కొప్పాల గోపి, పేట చంద్ర, పేట చిరంజీవి పర్వతాల హరి,ఢిల్లిబాబు, రాఘవ, బద్రి, శశి,మోహన్, మహేష్, లక్ష్మణ్, మణి, చందు, సురేష్, ప్రదీప్, రాజు, సాయి,తేజ, హరికృష్ణ,భాను,మునిచంద్ర, మనోన్,నవీన్ జనసేన పార్టీ నాయకులు పవన్ అభిమానులు పాల్గొన్నారు.

## ఆడిన మాట తప్పని నాయకుడు చంద్రబాబునాయుడు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 23 ప్రభాతవార్త



ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీని తు.చ.తప్పక ఆచరించే మహానాయకుడు చంద్రబాబునాయుడు అని మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని గుడిమల్లం, పెను మల్లం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలకు అభివృద్ది గురించి వివరిస్తూ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఆవిర్భావం నుంచి శ్రీకాళహస్తి అభివృద్ధిపై బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, నారాచంద్రబాబు నాయుడులు ఏర్పేడు మండలాన్ని పారిశ్రామికంగా విద్యాపరంగా అభివృద్ధికి ప్రణాళికా బద్దంగా చర్యలు తీసుకున్నారు.నేడు నియోజకవర్గాన్ని పరిపాలిస్తున్న సుధీర్‌రెడ్డి మండలాన్ని పారిశ్రామికంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధి పరచుటకు కృషి చేస్తున్నారని ధనంజయులు నాయుడు అన్నారు.ఈ కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, శివశంకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, బత్తలగిరి నాయుడు, బాబునాయుడు, సూరినాయుడు, సుధాకర్,కృష్ణప్ప మొదలి సీతాపతి ఆచారి,టి.శేఖర్ పద్మనాభనాయుడు, రాజశేఖర్‌నాయుడు, సురేష్‌నాయుడు,నవీన్, ఎం.రాజ, మురళి, సుధాకర్, బి.వెంకటేష్, బాలయ్య,ధనంజయులు,దినకర్, చంద్రశేఖర్, సారధి, చంద్రమౌళి, మునికృష్ణయ్య, జాఫర్, డాక్టర్ మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

## తొండమనాడు చెరువుకు మహర్దశ

శ్రీకాళహస్తిరూరల్, జూలై 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువు మహర్దశకు ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు మండల తెలుగుదేశం నాయకులు వివరించారు. ఏడాది సుపరిపాలనలో భాగంగా బుధవారం తొలిఅడుగు కార్యక్రమాల్లో భాగంగా ఎగువ వీధి, తొండమానడు దళితవాడ, రాచగున్నేరిలలో పర్యటించారు. బొజ్జల వెంకటసధీర్‌రెడ్డి గెలిచిన ఏడాదిలో గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నేడు కూటమిలో రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రంగినేని చెంచయ్య నాయుడు వివరించారు.ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు అక్షింత కృష్ణయాదవ్, బొల్లినేని జగన్నాధం నాయుడు,బత్తిరెడ్డి, రేవిళ్ళ రమేష్,జగదీశ్వరంరెడ్డి, దొరైరాజ్‌రెడ్డి,మోహన్‌నాయుడు, దామోదర్‌రెడ్డి, బాలాజినాయుడు, మనోహర్, హరికృష్ణ, సుదర్శనం రెడ్డి, మాధవయ్య,బాబునాయుడు, మురళి, అంకయ్య,కుమారస్వామి, విజయ్‌కుమార్, పొలయ్య, రమేష్ తదితరులుపాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సూపర్‌వైజర్ దారే సపరేటు

శ్రీకాళహస్తి,జూలై 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రలో అర్హత లేని సూపర్‌వైజర్ పెత్తనం నిరుపేదల బతుకులతో చెలగాటంగా మారిందని సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య,పట్టణ సహాయ కార్యదర్శి కోగిల మునిచందులు ఆరోపించారు. బుధవారం వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఎలాంటి విద్యార్హతలు లేని ధనమ్మను గత ప్రభుత్వ హయాంలో సూపర్‌వైజర్‌గా నియమించారు. ఆమె నేడు కూటమి అధికారంలోకి వచ్చినా పెత్తనం చెలాయిస్తుందని వివరించారు.ఆమె కార్మికుల పట్ల వేధింపులు రోజు రోజుకు పెచ్చుపెరిగిపోతున్నాయని, అందుకు ఉదాహరణ ఎంతో కాలంగా ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికురాలుగా పని చేస్తున్న మునెమ్మను నిర్ధాక్షిణ్యంగా చిన్న చిన్న కారణాలను చూపి తొలగించిందని ధ్వజమెత్తారు.ఇప్పటికే ఆమె కుటుంబానికి చెందిన ఆరు మంది ఇక్కడ ఉన్నారని ఇంకా తమ బంధువులను చేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో 25 సంవత్సరాలుగా పని చేస్తున్న మునెమ్మను తొలగించటం దారుణమన్నారు.

## గిరిజన భూములకు బండి బాట కల్పించండి

శ్రీకాళహస్తిరూరల్,జూలై 23 ప్రభాతవార్త

మండలంలోని గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని అలాగే పలు గ్రామాల్లో వారి భూములకు వెళ్ళటానికి సరైన దారి లేక తిప్పలు పడుతున్నారని బుధవారం ముసలిపేడు గిరిజనుల తహాశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యను వివరిస్తూ ముసలిపేడు గ్రామానికి సమీపంలో గిరిజనులకు ప్రభుత్వం భూములు అందించింది. అక్కడ వారు ఎంతో చక్కగా తీర్చుకొని వ్యవసాయం చేస్తున్నట్లు వివరించారు. అయితే వర్షాకాలం, వ్యవసాయం కాలంలో వారి పంట పొలాల వద్దకు వెళ్ళటానికి కనీసం బండి బాట కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్నట్లు తహాశీల్దార్‌కు విన్నవించారు. వారి గోడు విన్న తహాశీల్దార్ తాను వచ్చి పరిశీలించి బండి బాటకు అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.ఈ మేరకు సిపిఐ నాయకులు జనమాల గురవయ్య మండల పార్టీ సహచరులు పాల్గొన్నారు.

## 25నపేట ఆరోగ్యకేంద్రంలో స్విమ్స్ వైద్యశిబిరం

శ్రీకాళహస్తిరూరల్,జూలై 23 ప్రభాతవార్త

ఈనెల 25న మండలంలోని పాపానాయుడుపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో స్విమ్స్ సారధ్యంలో నిర్వహిస్తున్న పింక్‌బస్సు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నామని పిహెచ్‌సి డాక్టర్ ఎం.నాగరాజు బుధవారం తెలిపారు.టిటిడి సారధ్యంలో నిర్వహిస్తున్న స్విమ్స్ ప్రత్యేకంగా క్యాన్సర్ నిర్ధారణ వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సు ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల్లో శిబిరాలు నిర్వహించి క్యాన్సర్ నిర్ధారణ చేపడుతున్నట్లు వివరించారు. స్క్రినింగ్ పరీక్షలకు పింక్‌బస్సు స్విమ్స్ డాక్టర్లు పేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో స్క్రినింగ్ ట్రస్టు నిర్వహిస్తారన్నారు. ఎలాంటి లక్షణాలున్నా ఉచితంగా వైద్య పరీక్షలు జరిపించుకోవాలన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నాగరాజు తెలిపారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

పుత్తూరు రూరల్, జూలై 23 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం సమీపంలో ఉన్న శ్రీ దక్షిణ కాళీ వారాహి శక్తి పీఠం వద్ద ఆడి నెల ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అన్ని వైద్య చికిత్స నిమిత్తం 40 మంది డాక్టర్లతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుందని శక్తిపీఠం చైర్మన్ మోహనమ్మ తెలియజేశారు. భోజన సౌకర్యం, రవాణా సౌకర్యంతో ఆటోలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున పుత్తూరు సమీపంగ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆలయ కార్యదర్శి హరి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కూటమి పాలనతోనే రాష్ట్రంలో సుపరిపాలన

పుత్తూరు రూరల్, జూలై 23 ప్రభాతవార్త:



తెలుగుదేశం కూటమి పరిపాలనతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం నిరాటంకంగా కొనసాగుతున్నాయని పుత్తూరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్‌లు పేర్కొన్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు రూరల్, క్లస్టర్ ఇన్‌చార్జి గంజిమాధవయ్య ఆధ్వర్యంలో పుత్తూరు రూరల్ మండలం కేబీఆర్ పురం గ్రామ పంచాయతీలోని 94, 95 బూత్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో తెలుగుదేశం కూటమి పరిపాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పీఆర్ మంగళం సింగిల్‌విండో ప్రెసిడెంట్ మోహన్‌రాజు, యూనిట్ ఇన్‌చార్జి వెంకట రమణ, బూత్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు మగేష్, అయ్యప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోసలనగరంలో సుపరిపాలన తొలి అడుగు

విజయపురం, జూలై 23 ప్రభాతవార్త:



మండలంలోని కోసలనగరం పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు బుధ వారం కోసలనగరం పీఏసీఎస్ అధ్యక్షుడు బాబు యాదవ్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గత ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు,ఐడీ కార్డులు వితరణ

కేవీబీ పురం, జూలై 23 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలంలోని వేములపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు,గుర్తింపు కార్డులను బీజేపీ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేఖర్ యాదవ్ వితరణ చేసినట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీపతి, రవికుమార్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ శివశేఖర్, సీఆర్పీ సూపర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాల అర్హులను గుర్తించండి

వడమాలపేట, జూలై 23 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బంగారు కుటుంబాలు అర్హులను ఈ నెలాఖరు లోపు గుర్తించాలని వడమాలపేట ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. బుధవారం వడమాలపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కార్యదర్శులు బంగారు కుటుంబాల అర్హులు గుర్తింపు, పంచాయతీల్లో పారిశుధ్యంకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్థలంలో, గుట్ట పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారు చలానా చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చునని తహసీల్దార్ జరీనా తెలిపారు. అలాగే ఇంటి స్థలం లేకుండా అర్హులైన వారు ఉంటే పట్టా కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మండలంలో భూముల రీ సర్వే అయ్యన్నగారిపల్లిలో జరుగుతుందన్నారు. పామాయిల్ పంట సాగు చేసే రైతులకు వంద శాతం సబ్సిడీ, పండ్ల తోటలు, కూరగాయలు, పూల పంటలు వేస్తే 20 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు. ఓబీఆర్ కండ్రిగ రోడ్డు అధ్వానంగా ఉందని పాదచారులు నడిచి వెళ్ళడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని, రోడ్డు నిర్మించాలని సర్పంచ్ శ్రీవిద్య కోరారు.

## బీడీ బాలాజీకి రెండవ పర్యాయం బిజెపి ప్రధాన కార్యదర్శి పదవి

.రేణిగుంట జూలై 24 ప్రభాతవార్త



రేణిగుంట పట్టణానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు, రేణిగుంట హై స్కూల్ పూర్వ విద్యార్థి సంఘం నాయకులు బీడీ బాలాజీ ని ద్వితీయ పర్యాయం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. 2023 25 మధ్యకాలంలో జిల్లా అధ్యక్షులుగా చంద్రప్ప బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు ఆయన కమిటీ నందు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం సామంచి శ్రీనివాసులు జిల్లా అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా కమిటీలో రెండవసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా బీడీ బాలాజీ నియమితులయ్యారు. నరేంద్ర మోడీ పనితీరుకు ప్రభావితులై, బిజెపి సిద్ధాంతాలకు ఆకర్షితులై 2014 సంవత్సరం బిజెపిలో చేరారు. అప్పటినుండి బిజెపి సిద్ధాంతాలను పాటిస్తూ, నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీకి విశ్వాస పాత్రుడుగా ఉన్నందువల్ల ఈ పదవి వరించింది. తనకు పదవి రావడానికి సిఫార్సు చేసిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు పదవి ఇచ్చిన తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు.

## మణిని వరించిన మండల సిపిఐ కార్యదర్శి పదవి



రేణిగుంట జూలై 24 ప్రభాతవార్త

రేణిగుంట మండల సిపిఐ కార్యదర్శిగా వైయస్ మణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రేణిగుంట పట్టణంలో జరిగిన సిపిఐ పార్టీ 12వ మండల మహాసభలో మణి ని మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నందు 15 మంది ఆఫీస్ బ్యారర్ ఎంపికయ్యారు. ఈ ఎన్నికలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి, నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన, వర్గాలకు అండగా ఉంటానన్నారు. మండలంలోని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పదవిని ఇచ్చిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్ జి టి 3. మణి (పై ఫోటో)

## విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

వడమాలపేట, జూలై 23 ప్రభాతవార్త:



భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మత్తు పానియాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ మండల ఇన్‌చార్జి కమల్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ ద్వారా నో డ్రగ్స్, నో టెన్షన్స్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తుకు బానిస కాకూడదని, చదువులపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. సెల్‌ఫోన్లను విడనాడాలని, అసభ్యపు యాప్‌లపై వెంటనే పోలీసులకు తెలపాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, హెడ్ కానిస్టేబుల్ దేవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రేడ్ 1 గ్రంథాలయానికి పోటీపరీక్షల పుస్తకాలు వితరణ

తిరుపతికార్పొరేషన్, జూలై 23 ప్రభాతవార్త



తిరుపతి అన్నమయ్యకూడలిలోని గ్రేడ్ 1 గ్రంధాలయకు ఎంకె నాయుడు మేనల్లుడు చంద్రగిరికి చెందిన డి.వెంకటేశ్వర్లునాయుడు పోటీపరీక్షల పుస్తకాలు వితరణ చేశారు. 7వేల రూపాయలు విలువైన ఈ పుస్తకాలు స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఫారెస్ట్ బీట్ అధికారి, పట్టాభిరామ్ వ్యక్తిత్వ పుస్తకాలు, ఆర్ఆర్‌బి, ఎస్‌బిఐ ప్రొబేషనరీ ఆఫీసర్ పోటీపరీక్షలకు సన్నద్దం చేసేలా ఉపయోగపడుతాయి. కొత్తపుస్తకాలను గ్రంధాలయాధికారి జె.శివప్రసాద్‌కు బుధవారం అందజేశారు. ఈ పుస్తకాలను పోటీపరీక్షలకు తర్ఫీదు అయ్యే అభ్యర్థులు పరిశీలించుకోవచ్చని, గ్రంధాయంలో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

## ఐక్యతే సమగ్రాభివృద్ధికి సూచిక : ఎంపిడిఓ

తిరుపతిరూరల్, జూలై 23 ప్రభాతవార్త:

సచివాలయ ఉద్యోగులలో ఐక్యతతో పాటు పరస్పర సహకారం, అవగాహన ఉన్నప్పుడే అభివృద్ధి సుసాధ్యమని తిరుపతిరూరల్ ఎంపిడిఓ రామచంద్ర అన్నారు. ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రగతి సాధించవచ్చునని తెలిపారు. బుధవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరములో వివిధ మండలాల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సవాబుదారీ తనంగా బాధ్యతయుతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. పంచాయతీ కార్యాలయాలకు వచ్చే పౌరులు పట్ల మర్యాదపూర్వకంగా మెలగడమే కాకుండా వారు అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాచారం ఇవ్వాలన్నారు.

# తిరుపతి డివిజన్

## వేడుకగా సాగుతున్న ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవం



నారాయణవనం, జూలై 23 ప్రభాతవార్త : ఆడినెలలో ప్రారంభమయ్యే ఆండాల్ అమ్మవారి తిరువాడిపుర ఉత్సవాలు బుదవారం నాల్గవ రోజు కూడా ఘనంగా సాగింది. నారాయణవనం మేజర్ పంచాయతీలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదే సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవంను టిటిడి అధికారులు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు హారతులు సమర్పించుకున్నారు.

## ధర్మరాజుల తిరునాళ్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా గోడపత్రిక ఆవిష్కరణ

నారాయణవనం, జూలై 23 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో వెలసిన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాలకు సంబందించి గోడపత్రికను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం ఆవిష్కరించారు. అంతకుముందు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్‌లను దుశ్శాలువతో ఉత్సవ నిర్వాహకులను సత్కరించారు. ఆగస్టు 1నుంచి 11వ తేది వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు దేశప్పరెడ్డి తెలిపారు. గ్రామపెద్దలు గోపిరెడ్డి, బాలన్, శరవణరెడ్డి, సొరకాయులురెడ్డి, లోకయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం సిబ్బంది సమస్యలను పరిష్కరించండి : జడ్పీటీసీ



*నారాయణవనం, జూలై 23 ప్రభాతవార్త :* సచివాలయం సిబ్బంది గ్రామంలో కనిపించే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ స్థానిక భీమునిచెరువు సచివాలయంలో జరిగిన సమావేశంలో తెలిపారు. బుధవారం మండలంలోని భీమునిచెరువు, కశింమిట్ట, డికెపాలెం, బొబ్బరాజుపాలెం, నారాయణవనం సచివాలయంకు కొత్తగా బదిలీపై వచ్చిన సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం సిబ్బందిని సత్కరించారు. ఎంపిడిఓ అరుణ, డిప్యూటీ ఎంపిడిఓ డాక్టర్ వేణయ్య, సర్పంచులు ఆరుముగం, శశికళ అయ్యప్ప, రమేష్‌బాబు, కెజి శారదమ్మ గణేషన్ కుమారుడు లక్ష్మణన్, స్వర్ణలత, కార్యదర్శులు సుకుమార్, లీలావతీ, కిరన్, స్థానిక నాయకులు కె సుధాబాబు, కె ఆరుముగం, మునిరాజు పాల్గొన్నారు.

## స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రికి ఎమ్మెల్యే ఆదిమూలం ఘన సత్కారం

నారాయణవనం, జూలై 23 ప్రభాతవార్త :





బుధవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన జాతీయ మహిళా సాధికారత కార్యక్రమంకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురిని దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నాయిబ్రాహ్మణ నగర కార్యవర్గానికి రాష్ట్ర నేతల అభినందనలు

*తిరుపతి హెల్త్, జూలై 23 ప్రభాతవార్త ః* పోటా పోటీ నడుమ స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగిన నగర నాయిబ్రాహ్మణ నూతన కార్యవర్గానికి ఆ సంఘం రాష్ట్ర నేతలు అభినందనలు తెలిపారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ సిబ్యాల సుధాకర్, సంఘం గౌరవ అధ్యక్షులు కన్నెమడుగు



రాంనారాయణ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపొందిన నగర నూతన అధ్యక్షులు ఎస్.జయకుమార్‌ను, ప్రధాన కార్యదర్శిగా గెలుపొందిన గల్లా దామును, కోశాధికారి పోస్టులో గెలిచిన ఉప్పలపాటి శివను అభినందించారు. ఈ కార్యక్రమంలో నేతలు కమల్, రాష్ట్ర యువజన కార్యదర్శి భజంత్రి రవిచంద్ర, సంఘం పెద్దలు, నాయిబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నా బిడ్డకు ప్రాణం పోయండి

తిరుపతి హెల్త్, జూలై 23 ప్రభాతవార్త ః



తిరుపతి జిల్లా నారాయణ వనం మండలం నాగిలేరు గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తన బిడ్డ మురళీ (8)కి ప్రాణం పోయాలని బాధిత తల్లిదండ్రులు చెంగమ్మ, దేశయ్యలు మీడియా ముందు కన్నీరు పెట్టారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్ని రోజులుగా తన బిడ్డ క్యాన్సర్ వ్యాధికి గురై కొట్టుమిట్టాడుతున్నాడని బాధపడ్డారు. మొదటగా బిడ్డ అనారోగ్యం కారణంగా రుయా ఆస్పత్రిలో చూపించడం జరిగిందని, ఆరోగ్య తీవ్రతను పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు రెఫర్ చేశారన్నారు. స్విమ్స్‌లో తన బిడ్డకు కొన్ని పరీక్షలు చేయగా అందులో బ్లడ్ క్యాన్సర్ అని దీని టెస్టులకే 40 వేలు అవుతుందని సూచించారని వాపోయారు. అంతే కాక బిడ్డకు శస్త్ర చికిత్సతో పూర్తిగా నయం కావాలంలో మరో రూ.20లక్షలు ఖర్చు అవుతుందని సూచించారు. చాలీచాలనీ జీవితాలతో బతుకులు వెళ్ళ దీస్తున్న తమ వద్ద అంత డబ్బు ఖర్చు పెట్టే స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దయాహృదయులైన దాతలు సహకరించి తనకు ఆర్థిక సాయం అందించే దాతలు ఈ సెల్ నెంబరును సంప్రదించి అకౌంట్ నెంబరు పరిశీలించి సహాయం అందించాలని వేడుకున్నారు. సెల్ 7780253548, అకౌంట్ నెంబరు 071401000060434, ఐఎఫ్‌సీ కోడ్ ఐఒబిఏ 0000714 అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బోధనపై మరింత దృష్టి సారించాలి

పాకాల, జూలై 23 ప్రభాతవార్త

పాకాల మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలోని ఉపాధ్యాయులు వారి దృష్టిని విద్యా బోధనపై మరల్చాలి అని బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి వేంకటాద్రి నాయుడు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో పాకాల మండలం మొత్తం ఉత్తీర్ణత దాదాపు 47 పరిమితం కావటం ఒక ఉదాహరణ. ఇక మండలంలోని ఒక్కో పాఠశాలలలో ఈ ఉత్తీర్ణత శాతం మరీ తక్కువగా నమోదు కాబడింది. పాకాల మండలంలో సరైన విద్య అందక దాదాపు 43 విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో ఫెయిలై ఇబ్బందులు పాలైనారు. ఇప్పటికయినా ఉపాధ్యాయులు వారి కర్తవ్యాన్ని పబ్లిసిటిగా మార్చే ప్రయత్నం మాని, ప్రతి చిన్న విషయానికి స్కూల్ పిల్లలతో రోడ్డు లపై మానవహారాలు, నిరసనలు, ప్రదర్శనలు, లాంటివి చేపించటం కాకుండా పిల్లలకు మెరుగైన విద్య భోధన పై దృష్టి సారించాలని అన్నారు.

## ఎన్‌పీసీఐ లింకు, ఆధార్ అప్‌డేట్ చేసుకోండి : ఏవో

సత్యవేడు, జూలై 23 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాకు జమ కావాలంటే ఎన్‌పీసీఐ లింకు చేసుకోవడంతో పాటు ఆధార్ అప్‌డేట్ తప్పని సరిగా చేసుకోవాలని సత్యవేడు మండల వ్యవసాయ అధికారి మురళి కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో ఇంకా ఎన్‌పీసీఐ, ఆధార్ అప్‌డేట్‌లేని రైతులు 55 మంది ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇందులో ఎన్‌పీసీఐ 34 మంది, ఆధార్ అప్‌డేట్ 21 మంది రైతులు ఉన్నట్టు ఆయన వివరించారు. ఆధార్ అప్‌డేట్ లేని వారు సంబంధిత ఆధార్ సేవా కేంద్రానికి వెళ్లి వేలి ముద్రలతో అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అలాగే ఎన్‌పీసీఐ లింకు లేని రైతులు బ్యాంకుకి వెళ్లి ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి: పరామర్శ

తొట్టంబేడు,జూలై 23 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలం పొయ్య దళిత కాలనీలో నివాసముంటున్న కుక్క పార్వతమ్మ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి చిత్తూరుజిల్లా వైకాపా కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు బుధవారం కాలనీలోని వారి నివాసానికి వెళ్ళి కుటుంబాన్ని పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన వాసుదేవనాయుడు పార్టీ అధ్యక్షుడు కోగిల సుబ్రమణ్యంలు కలసి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు. భరోసా ఇచ్చారు.నిరుపేద కుటుంబం అయిన పార్వతమ్మ మృతి తీరని లోటుగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. అంత్యక్రియలకు తమ వంతు ఆర్థిక సహాయం అందించారు.

## అన్నా క్యాంటీన్ శివాలయం స్థలంలో లేదు : గాలి జీవరత్నంనాయుడు

పుత్తూరు, జూలై 23 ప్రభాతవార్త :



పట్టణంలోని కార్వేటినగరం రోడ్డు కూడలిలో వున్న అన్నా క్యాంటీన్ వున్న సదాశివేశ్వరస్వామి దేవస్థానం స్థలంలో లేదని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు అయిదు రూపా యలకే అన్నం పెట్టాలనే సదుద్దేశ్యంతో టిడిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రారంభించిందన్నారు. ప్రజల మన్ననలు పొందిన అన్నా క్యాంటీన్‌ను మూసివేయాలనే కుట్రతో అన్నా క్యాంటీన్ వున్న స్థలం శివాలయానికి చెందినదని కొందరు అపద్దపు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సర్వే నెంబరు 301/2లో వున్న 8.2 ఎకరాల గ్రామ కంఠం భూమిలో అన్నా క్యాంటీన్‌ను నిర్మించామన్నారు. క్యాంటీన్ నిర్మాణానికి మునిసిపాలిటీ ఈ స్థలాన్ని అధికారికంగా అప్పగించిందని తెలిపారు. కొందరు తమ స్వార్థ రాజకీయాల కోసం గుడిని వాడుకోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

## ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం



గూడూరు, జూలై 23 ప్రభాతవార్త : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుదురు గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు, పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గురవయ్య మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రూరల్ మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలన్నారు అదేవిధంగా ప్రతి అధికారిని, వారి శాఖల గురించి జరిగిన అభివృద్ధి జరగబోయే అభివృద్ధి గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఊటుకూరు యామిని, వైస్ ఎంపీ పి మానం ఇంద్రాణి, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రూ.50లక్షలతో ఆస్పత్రి భవనం పనులు



బాలాయపల్లి, జూలై 23 ప్రభాతవార్త : మండల కేంద్రమైన బాలాయపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.50 లక్షలతో ప్రజారోగ్య విభాగం భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో ఉన్న భవనం శిథిలా వస్థకు చేరడంతో నూతన భవనం మంజూరు అయింది. 15 ఆర్థిక సంఘం, కలెక్టర్ నిధులతో పాత భవనం స్థానంలో నూతన భవనం నిర్మిస్తున్నారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం నిర్మిస్తున్నారు. ఈ పనులను పంచాయితీ రాజ్ డి.ఈ. లక్ష్మినారాయణ మార్కింగ్ చేసి, పనులను పర్యవేక్షించారు. నూతన భవనం నిర్మాణాన్ని 6 నెలలలోగా పూర్తి చేయాలనీ, పనులు నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారుకు సూచించారు.

## కాళంగి నది గండ్లు పూడ్చండి



సూళ్లూరుపేట, జులై 23 ప్రభాతవార్త: సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో విస్తరించి ఉన్న కాళంగి నది ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అక్కడక్కడ గండ్లు పడ్డాయని, వీటిని త్వరితగతిన పూడ్చి రైతులకు నష్టం చేకూరకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఈ ప్రాంతవాసులు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. జనవరి నెలలో నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా పడవలకు ఇవ్వాల్సిన బకాయిలకు సంబంధించిన నగదు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. అలాగే తడ మండలంలోని పూడికుప్పంలో మత్స్యకారులకు ఇళ్ల స్థలాల విషయం కొంతకాలంగా పెండింగ్‌లో ఉందని, వాటిని పరిశీలించి తగు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో బొమ్మన్ పళణి, బొమ్మన్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## నేను అసభ్య పదజాలంతో దూషించలేదు : కమిషనర్



గూడూరు, జూలై 23 ప్రభాతవార్త: నేను ఎవరిని అసభ్య పదజాలంతో దూషించలేదని సిఐటియు నాయకులు ఆసత్య ఆరోపణలు చేస్తూ నాపై ఫిర్యాదు చేశారని, గత 17 నెలలుగా ఎక్కడ ఎటువంటి చెడ్డ పేరు లేకుండా విధులు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కమీషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వారం రోజులుగా కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ఇంజనీరింగ్ వర్కర్లు జీతాలు పెంచాలని సమ్మె నిర్వహిస్తున్నారని ప్రజలకు ఎక్కడ పారిశుద్ధ్య సమస్య లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నామని తెలిపారు. సిఐటియు నాయకులు సోమవారం తన వద్దకు వచ్చి మీ దగ్గర పని చేస్తున్న కారు డ్రైవర్ వేరే మహిళ వద్ద డబ్బులు అప్పు తీసుకున్నారని దాన్ని ఇప్పించాలని కోరగా ఇది వారి వ్యక్తిగత సమస్యని మీరు మీరు మాట్లాడుకోవాలని సూచించామని తెలిపారు. దీన్ని వక్రీకరించి నేను వారిని దుర్భాషలాడానని దౌర్జన్యం చేసామని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని అయితే ఎక్కడా నేను ఎవరిని అసభ్య పదజాలంతో దూషించలేదని వాదనలు జరిగాయని పేర్కొన్నారు. నాతో ఇంకా అనేక ఆరోపణలు చేశారని వాటిని రుజువు చేయాలని నేను తప్పు చేశాను అని తేలితే శాఖాపరమైన చర్యలకు సిద్ధమని వెల్లడించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గూడూరు, జూలై 23 ప్రభాతవార్త: పట్టణంలోని డాక్టర్ సి.ఆర్.రెడ్డి రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు ను నిర్వహించారు. ఈ క్యాంపులో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ జి.సంఘమిత్ర మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో 35 సంవత్సరాలు పైబడిన వారు తల తిరగడం, నరాల సమస్యలతో ఎక్కు వగా బాధపడుతున్నారని, దీనిని అశ్రద్ధ చేయ కుండా డాక్టర్లను సంప్రదించాలని తెలియజేశారు. అలాగే ప్రముఖ డయాబెటిక్ డాక్టర్ పి.జగదీష్ జగదీష్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మోహన్ సాయి రూప షుగర్ వ్యాధి, గైనకాలజీ సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అక్కన రమణయ్య, క్యాంప్ ఛైర్మన్ లయన్ షేక్ రియాజ్ అహ్మద్, లైన్స్ సోమిశెట్టి చెంచురామయ్య, డాక్టర్ చంద్రహాస్, మదనమేటి రమణయ్య, మల్లెమాల మురళి రెడ్డి, సీనయ్య, రూపేష్ రెడ్డి, ఆర్ రవిచంద్ర, వీరేంద్రనాథ్, అడ్వకేట్ రజనీకాంత్ రెడ్డి, డాక్టర్ సుగుణమ్మ, కిమ్స్ హాస్పిటల్ వీఆర్వో నవీన్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు



కోట, జులై 23 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం 13 నెలల కాలంలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా టిడిపి కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చెంగల్రావు, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్‌లు అన్నారు. వారు బుధవారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఎంఎల్‌సీ మేరిగ మురళీ కూటమి ప్రభుత్వ పాలనపై పసలేని ఆరోపణలు చేయడం తగదన్నారు. నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో రోడ్లపై నడవలేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రోడ్లు వేసినట్లు తెలిపారు. అంతేకాకుండా కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై ఎంఎల్‌సీ మేరిగ మురళీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

## టిడిపి మండల పార్టీ అధ్యక్షులుగా రాయి



బాలాయపల్లి, జూలై 23 ప్రభాతవార్త: మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా రాయి సత్యం నాయుడిని ఎంపిక చేసినట్టు తెలిసింది. గత రెండు రోజుల క్రితం నియోజకవర్గం పార్టీ నాయకులు కార్యకర్తలు సమావేశంలో ఆయనను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. టిడిపి మండల పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైనందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను అని తెలిపారు.

## కళాకారుడు వినోద్‌కి ఆర్థిక సహకారం

గూడూరు, జూలై 23 ప్రభాతవార్త: మండలంలోని ఇందూరు గ్రామానికి చెందిన దప్పు కళాకారుడు వినోద్ ఇటీవల రైలు ప్రమాదంలో కాలు కోల్పోవడంతో పండరి భజన కళాకారులు 1.25లక్షలు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పండరి భజన కళాకారులు టీవీ కృష్ణదాసు పెంచల దాసు పెంచల్‌రెడ్డి, జి.ప్రభాకర్, పి.శ్రీకాంత్, లక్ష్మయ్య, యానదయ్య, మురళి, పెంచలయ్య, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## బాలసదన్‌లో చిన్నారులకు వైద్య పరీక్షలు

కోట, జులై 23 ప్రభాతవార్త: కోటలోని బాలసదన్‌లో బుధవారం వైద్యాధికారులు చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉన్నారా లేదా అని పరీక్షించారు. విటమిన్లతో కూడిన పోషకాలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. సిడిపిఓ మునికుమారి పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్తల్లో జోష్

కోట, జులై 23 ప్రభాతవార్త: మండలంలోని వైసీపీ కార్యకర్తల్లో గత ఏడాదిగా నిరుత్సాహం కనిపిస్తూ వచ్చింది. అయితే ఈ నెల 22వ తేదీన వైసీపీ అగ్రనేతలు, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి కొడవలూరు ధనంజయరెడ్డి, ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్‌లు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు 500 మంది రావచ్చని వైసీపీ శ్రేణులు అభిప్రాయపడ్డారు. అయితే ఊహించని విధంగా రెండువేల మందికి పైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావడంతో ఆ పార్టీ క్యాడర్‌లో జోష్ కనిపించింది. మొత్తంమీద ఈ కార్యక్రమంతో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలుగా ప్రశాంతిరాజు



బాలాయపల్లి, జూలై 23 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలుగా దొమ్మరాజు ప్రశాంతి రాజును నియమిస్తూ జిల్లా అధ్యక్షులు ఎస్ శ్రీనివాస్ ఉత్తరాలు జారీ చేశారు. మండలంలోని నాయుడు చెరువు గ్రామా నికి చెందిన ప్రశాంత్ రాజు బిజెపి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ తనపై ఉన్న నమ్మకం జిల్లా ఉపాధ్యక్షురాలు పదవి ఇచ్చారని పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారని తెలిపారు.

## స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసిన ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, జులై 23 ప్రభాతవార్త: తిరుపతి పర్యటనకు వచ్చిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతి కేంద్రంగా నిర్వహించే జాతీయ మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అయ్యన్నపాత్రుడుతో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హాజరయ్యారు.

## చెరువును తలపిస్తున్న వీధులు



దొరవారి సత్రం, జులై 23 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండల పరిధిలోని తెనాలి గ్రామంలో ఉన్న వీధులు చెరువు లాగా ఉన్నాయి గత ఆరు నెలలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న విధంగా వున్నాయి. తనియాల నుండి శ్రీకాళహస్తికి నిత్యం బస్సులు వెళ్ళుతాయి, ఈ తనియాల గ్రామంలో ఉన్న వీధులు గుంటలమయంగా మారి వాహనదారులు ఆ గుంటలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అంటున్నారు. మరోవైపు వర్షానికి పడ్డ చినుకులు గుంటల చేరి నీరు ఎటు పోవడానికి వీలు లేక ఆ నీటి వల్ల దోమలు అధికంగా ఉత్పత్తి పెరుగుతున్నాయి అని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పీ4 తో పేదరిక నిర్మూలన : అబ్దుల్ రహీం

గూడూరు, జూలై 23 ప్రభాతవార్త: పట్టణంలోని 20, 21వ వార్డు సచివాలయాలలో జరిగిన పి4 అవగాహన సదస్సులు సచివాలయాల అడ్మిన్‌లు జీవిత, ధనలక్ష్మిల అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గూడూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ ఉపాధ్యక్షుడు ఆరికట్ల మస్తాన్ నాయుడులు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంతో పి4 కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పరమేశ్వర గౌడ్, శంకర్ నాయుడు, కేశవ్, శ్రీదేవి, సరస్వతమ్మ, పర్వీన్, ఛాంద్ బాషా, లక్ష్మణ్, అశోక్, కిషోర్, హరికృష్ణ, ముజఫర్, సచివాలయాల సిబ్బంది, ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి

పెళ్లకూరు, జులై 23 ప్రభాతవార్త : మండలంలో స్థానికంగా ఉన్న చాగాణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ మగ్గం శిక్షణ కంప్యూటర్ కోర్స్ మరియు బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న 150 మంది మహిళలకు ట్రస్ట్ ఆవరణలో సర్టిఫికెట్లు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ట్రస్ట్ సీఈఓ సీతారామ నాయుడు మాట్లాడుతూ మహిళా సాధికారత, స్వయం ఉపాధి లక్ష్యంగా గ్రామీణ మహిళలు మరియు నిరుద్యోగ మహిళలకు నైపుణ్య శిక్షణ ఇప్పించి వారికి స్వయం ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సీఈఓ సీతారామనాయుడు కృష్ణ గల్లా మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పథకం కూలీలకు వెంటనే నగదు చెల్లించాలి

వెంకటగిరి, జూలై 23 ప్రభాతవార్త : జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు వెంటనే నగదు చెల్లించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య తెలిపారు. ఉపాధి హామీ పథకం కూలీలకు నగదు చెల్లించాలని వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కలిసి ధర్నా చేశారు. రెండు నెలల నుండి ఉపాధి కూలీలకు నగదు చెల్లించడం లేదని తెలిపారు. ప్రతిరోజు కూలీలకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల క్రికెట్ పోటీలు

వెంకటగిరి, జూలై 23 ప్రభాతవార్త: తారకరామా క్రీడా ప్రాంగణంలో ఆల్ ఇండియా విద్యుత్ ఉద్యోగుల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు క్రికెట్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో 12 టీంలు పాల్గొన్నట్లు ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు కిరణ్ తెలిపారు. ఆల్ ఇండియా నుండి విద్యుత్ ఉద్యోగులు క్రికెట్ పోటీలకు వచ్చినట్లు తెలిపారు.

## బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు



చిల్లకూరు, జులై 23 ప్రభాతవార్త: పాలిచర్ల వారి పాలెం ఉన్నత పాఠశాలలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, లోకమాన్య బిరుదాంకితుడు బాలగంగాధర్ తిలక్ 170వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి అనసూయ, లావణ్య, ప్రజేంద్ర రెడ్డి చంద్రశేఖర్, మాధవయ్య, లీల, మధుసూదన్ రావు, నాగభూషణమ్మ, కామేశ్వరి, సుగుణ, రమణయ్య, సంధ్య విద్యుల్లత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి చండీకా అమ్మవారి బ్రహ్మోత్సవాలు





పెళ్లకూరు, జూలై 23 ప్రభాతవార్త : మండలంలోని చిల్లకూరు (వడ్డీపాలెం) గ్రామంలో వెలసియున్న శ్రీ చండికా పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవములు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలు 24వ తేదీ నుండి30 వరకు జరుగునని భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవములు ఆలయ ధర్మకర్త శ్రీ శ్రీ రాజమాత దేవి అమ్మవారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## స్పీకర్ అయ్యన్నపాత్రుని కలిసిన ఎమ్మెల్యే



వెంకటగిరి, జూలై 23 ప్రభాతవార్త : తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉప సభాధిపతి రఘురామ కృష్ణంరాజు, రెవిన్యూ మంత్రి అనగానీ సత్య ప్రసాద్‌లను ఎమ్మెల్యే రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్‌కు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

## మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన వృద్ధిమాన్ సాహా

వెంకటగిరి, జూలై 23 ప్రభాతవార్త: తారకరామా క్రీడా ప్రాంగణంలో ఆలిండియా ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల క్రికెట్ పోటీల్లో టీం ఇండియా వెటర్న్ క్రికెటర్ వృద్ధిమాన్ సాహా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. వెస్ట్ బెంగాల్ యూపీ టీమ్లు మధ్య మ్యాచ్లో వెస్ట్ బెంగాల్ తరఫున సహా 35 బంతుల్లోనే సెంచరీ కొట్టారు. ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి.

## వాలీబాల్ టోర్నమెంటుకు విద్యార్థినులు

చిల్లకూరు, జూలై 23 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదు నగరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సిబిఎస్ఈ స్కూల్ విద్యార్థినులకు నాగర్‌గుల్‌లోని డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 24వ తేది నుండి 26వ తేది వరకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో స్థానిక తూర్పు కనుపూరులోని నవనీత పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు 17 సంవత్సరాల లోపు విభాగంలో పాల్గొనుటకు స్కూల్ అడ్మిన్ ఆఫీసర్ పి. సుమంత్ రెడ్డి టీం కోచ్ ఎన్. కోదండరామయ్య, టీం మేనేజర్లు కె.అంజనాదేవి విద్యార్థులుతో పాటు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు శ్యాంబాబు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

దొరవారిసత్రం, జులై 23 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఎన్ ఎమ్ అగ్రహారం సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. స్థానిక వివరాల మేరకు సూళ్లూరుపేట మండల పరిధిలోని గుమ్మడి తాగేల నుండి నాయుడుపేటకు వెళుతున్న స్కార్పియో కారు ప్రమాదవశాత్తు ఇంజన్లో మంటలు రావడంతో డ్రైవర్ కారును పక్కన ఆపేసి అప్రమత్తమయ్యాడు. దీంతో కారు పూర్తిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

## బర్డ్‌లో పేదలకు ఉచిత శస్త్రచికిత్సలు :టిటిడి ఛైర్మన్



తిరుమల,జూలై 23ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని, ఇందుకోసం దాతల సహకారం తీసుకునేలా చూడాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సూచించారు. బర్డ్‌లో గ్రామీణ ప్రాంత రైతులకు, నిరుపేదలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఛైర్మన్, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్‌కు సూచించారు. తిరుపతి బర్డ్ ఆస్పత్రి నిర్వహణ, నిధుల సమీకరణ, అత్యుత్తమ వైద్యసేవలు, శస్త్రచికిత్సలపై సోమవారం తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలో టిటిడి ఈఓ జె.శ్యామలరావు, బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, టి.జానకిదేవి, వర్చువల్‌గా డాక్టర్ అదిత్‌దేశాయ్ ,జెఈఓ వీరబ్రహ్మం, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, ఎఫ్ఎసిఎఓ బాలాజీ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సమీక్షచేశారు. బర్డ్ ఆస్పత్రినికి అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

## కొండాపురంలో పొలం పిలుస్తుంది



వాకాడు, జూలై 23 ప్రభాతవార్త : మండలంలోని కొండాపురం, కాశీపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ నాగార్జున సాగర్ మాట్లాడుతూ పంట భూమి గురించి, ఈ క్రాప్ గురించి అదేవిధంగా పచ్చి రొట్టి విత్తనాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఒకటవ రైతు సేవా కేంద్రాలలో సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.కొండాపురం, కాశీ పురం గ్రామాలలో వ్యవసాయ వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారిని దీప, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు కోట విద్యార్థులు



కోట, జులై 23 ప్రభాతవార్త: మహారాష్ట్రలోని బిలాస్‌పూర్‌లో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు కోటలోని ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎవిఎల్ రావు, పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు. ప్రణీత్‌కుమార్ (6వ తరగతి), గౌతమ్‌రాజ్ (6వ తరగతి), బన్నీ (7వ తరగతి), నాగసాయి (7వ తరగతి), లక్ష్మీనారాయణ (7వ తరగతి)లు ఎంపికయ్యారు. ఇటీవల తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 13 మంది విజేతలుగా నిలిచారు.

## తుడ అభివృద్ధిలో ముందడుగుతో...ఛైర్మన్‌కు స్పీకర్ అభినందనలు



తిరుపతికార్పొరేషన్, జూలై 23ప్రభాతవార్త: తుడ ఛైర్మన్‌గా తక్కువకాలంలోనే తుడ పరిధిలో అభివృద్ధిని జరిగేలా ప్రణాళికలు రూపొందించడం సంతోష నీయమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు. తుడ పరిధిలో తొమ్మిది నియోజకవర్గాల్లో 700కుపైగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తుడ అప్రూవల్ అనుమతులు ఇవ్వడం, అక్రమ లేఅౌట్లు, అక్రమ భవనాలు గుర్తింపుపై శిక్షణ నివ్వడం అభివృద్ధికి సూచనగా పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరుతీసుకురావాలని స్పీకర్ దివాకర్‌రెడ్డికి సూచించారు.

## సర్వసభ్య సమావేశానికి ఎంపిపి డుమ్మా!



**ముఖం చాటేసిన జడ్‌పిటిసి**

శ్రీకాళహస్తి రూరల్, జూలై 23 ప్రభాతవార్త : రెండు నెలల కొకమారు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలకు కూడా మండలాధ్యక్షులు గైరు హాజరౌతున్నారు. ప్రజాసమస్యలపై అధికారులతో ముఖాముఖి చర్చించే అవకాశం ఉన్నా జడ్‌పిటిసి ముఖం చాటేస్తున్నారు. సమావేశం నిర్వహించుటకు కోరం కోసం గంటల కొద్ది నిరీక్షించాల్సిన దుస్థితి శ్రీకాళహస్తి మండలంలో చోటు చేసుకుంది. బుధవారం సర్వసభ్య సమావేశం అంటూ అధికారులు ప్రకటించారు. గతంలోవైకాపా పాలన సాగుతున్న కాలంలో సర్పంచ్‌లు, ఎంపిపిలు ఎంపికయ్యారు. బుధవారం నాటి మండల సమావేశానికి మంలాధ్యక్షురాలు డుమ్మా కొట్టారు. దాంతో కోరం కోసం సుమారు ఒరెండు గంటల పాటు నిరీక్షించి అక్కుర్తి ఎంపిటిసి రావమ్మను అధ్యక్షులుగా ఎన్నుకొని సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో అక్కుర్తి, చల్లపాళెం, వేడాం,ఎగువ వీధికి చెందిన ఎంపిటిసిలు పలు సమస్యలపై అధికారులను నిలదీసారు. మండలంలోని పలు పాఠశాలలను విలీనం పేరుతో మూత వేస్తూ విద్యార్థులను వీధుల పాల్జేస్తూ ప్రగల్భాలు పలకటం దారుణమని పలువురు అధికారుల ను నిలదీసారు.దాంతో ఎంఇఒ భువనేశ్వరి మాట్లాడుతూ మండలంలో 15 పాఠశాలలకు సంబంధించి తాము జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. కాగా ఎంపిడిఓ పద్మావతి మాట్లాడుతూ ఇరిగేషన్‌శాఖ సారధ్యంలో ఊరందూరు ఎస్‌టి కాలనీకి వెళ్ల దారిలో వంతెన నిర్మాణానికి రూ.16లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు.

## శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి బ్రహ్మోత్సవాలు

పుత్తూరు రూరల్, జూలై 23 ప్రభాతవార్త: పట్టణంలో శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 తేదీ నుంచి ప్రారంభమవుతుందని కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి తెలిపారు. ఈనెల 30న బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజ వాస్తు పూజ కలశస్థాపన అంకు రార్పణం, అలాగే 9 గంటలకు భక్తులచే పాలాభిషేకం, అభిషేకాలు, రాత్రి 7 గంటలకు శ్రీ విఘ్నేశ్వర స్వామివారు పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం, 31న గురువారం ఉదయం ఆలయంలో విశేష పూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి స్వామివారి అమ్మవారు కామధేను వాహనంపై రుక్మిణిస్ సత్యభామ సమేత శ్రీ కృష్ణ భగవాన్ ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆగస్టు1న శుక్రవారం ఉదయం నుండి11న సోమవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగుస్తాయని ఆయన తెలిపారు.

## రోడ్డు విస్తరణ పేరుతో నిరాశ్రయులను చేస్తున్నారు



చిత్తూరురూరల్, జూలై 23 ప్రభాతవార్త: రోడ్డు విస్తరణ పేరుతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమను నిరాశ్రయులను చేస్తున్నారని కట్టమంచి చెరువుకింద కాపురమున్న ఎస్ అమ్ములు అనే బాధితురాలు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. గత 45సంవత్సరాల క్రితం నుంచి కట్టమంచి పరిధిలోని గాండ్లపల్లె రెవిన్యూకు చెందిన రెండు సెంట్ల భూమిలో తమ కుటుంబసభ్యులు నివాస ముంటున్నామని, 1993లో చిత్తూరు తహశీల్దారు సైతం పట్టాను మంజూరు చేసారని, ఇందుకు సంబంధించి ఇంటి పన్నులను కడుతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ అధికారులు విస్తరణ పేరుతో తమ ఇంటి స్థలం ఆక్రమించుకొంటున్నారనీ, రోడ్డు విస్తరణలో తమ ఇంటి స్థలం పోతే ఎటు వంటి అభ్యంతరం లేదని, అయితే తమ ఇంటికి ఎదురుగా రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న వారికి తమ ఇంటి స్థలం కేటాయించేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో తమకు చిత్తూరు ఎమ్మెల్యే న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేసారు.

**మున్సిపల్ అధికారుల వివరణ:**

సంబంధిత స్థలం కట్టమంచి చెరువుకు చెందిన కారణంగా స్వాధీనం చేసుకొంటున్నామని, బాధితులకు తప్పకుండా ప్రత్యామ్నాయం చూపుతామని అధికారులు పేర్కొన్నారు.

## జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి విద్య, జూలై 23 ప్రభాతవార్త : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల,శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలల్లో 2025 26 విద్యా సంవత్సరం ప్రవేశానికి జూలై 25,26వ తేదీలలో ఉదయం 8 గంటలకు ఆయా కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.టీటీడీలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పిల్లలు, బాలమందిర్ పిల్లలు,సీటు వచ్చి వివిధ కారణాలతో మూడు విడతలలో కౌన్సెలింగ్‌కు హాజరు కానివారు,తిరుపతిలోని స్థానిక విద్యార్థినీ, విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. ఇదివరకే ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, సంబంధిత కళాశాలలో సీట్లు మాత్రమే కావాల్సివారు, ధ్రువీకరణ పత్రాలు, ఫీజులతో నేరుగా సంబంధిత జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాల్సి ఉంటుంది.

## స్విమ్స్‌లో నిర్మాణ పనులు పరిశీలించిన టీటీడీ ఛైర్మన్



తిరుపతి హెల్త్,జూలై 23 ప్రభాతవార్త : స్విమ్స్ ఆస్పత్రి ప్రాంగణం నిర్మాణంలో ఉన్న వివిధ విభాగాలకు సంబంధించిన భవనాలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. టీటీడీ ఈవో శ్యామలరావు, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్‌లతో కలిసి బుధవారం కార్డియాక్ న్యూరో సైన్సెస్, స్విమ్స్ పాత భవనం, స్టాఫ్ క్వార్ట్స్‌లను పరిశీలించారు. ఛైర్మన్ మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్విమ్స్ ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు సుచిత్ర, ఎల్లా, ఎన్. సదాశివరావు, జేఈవో వి. వీర బ్రహ్మం, సీఈ టివి సత్యనారాయణ, ఎస్.ఈలు మనోహర్, వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల వింత పోకడలు

శ్రీకాళహస్తి,జూలై 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయాధికారులు, సిబ్బంది రోజుకొక వింత పోకడలతో భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని హిందూ ధార్మిక మండలి నాయకులు బుధవారం శివమెత్తారు. సాధారణంగా సుబ్రమణ్యం స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా మొక్కులు చేసుకున్న భక్తులు చదివింపులంటూ సమర్పించుకోవటం ఆనవాయితీ. ఈ చదివిపులను తీసుకొనుటకు దేవస్థానం ఓ ఉద్యోగిని నియమిస్తారు. అయితే మంగళవారం రాత్రి కుమారస్వామి తప్ప వద్ద జరిగిన కళ్యాణోత్సవం సందర్భంగా భక్తులు చదివింపులు ఇవ్వటానికి వస్తే ఆలయ ఉద్యోగులు చదివింపులను హుండీల్లో వేయమనటం భక్తుల మనోభావాలను దెబ్బతీయటమే అవుతుందని మండలి సభ్యులు జంబుగోళం లోకేష్,కోనేటి విజయకుమార్, కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబులు విమర్శించారు.

**చారిత్రాత్మక ఆలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలి!**

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఆలయాలకు నిలయంగా ఉందని ముఖ్యంగా శివాలయాలకు వేదికగా ఉందని అయితే ఎందుకో ఆలయాలకు సంబంధించి ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి డెప్యూటి స్పీకర్ రఘురామకృష్ణం రాజుకు విన్నవించారు.